క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి



గౌరీపట్నంలో తలనీలాలు సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దెందులూరు: ఎస్సీ వర్గీకరణను రాష్ట ప్రభుత్వం త్వరగా అమలు చేసి, ఎస్సీ వర్గంలో ఉన్న 59 కులాలకు సమన్యాయాలని ఎంఆర్పీఎస్ నాయకులు తనగాల శేఖర్, బయ్యారపు రాజేశ్వరరావు అన్నారు. క్రైస్తవ పుణ్యక్షేత్రమైన గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత వద్ద తలనీలాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్పీ అధికార ప్రతినిధి మద్దాల తిరుపతిరావు, గెద్దం వినోద్‌కుమార్, ముప్పిడి దానియేలు, కండెల్లి సీతారామరాజు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని హెచ్‌ఎంకు అందిస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: దెందులూరులోని గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న పేద కుటుంబానికి చెందిన బుగ్గ దుర్గాప్రసాద్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్లో బాధితుడు చికిత్స పొందుతున్నాడని తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ వంతు విరాళాలు అందజేసి రూ.19,200 ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రధానోపాధ్యాయులు జి మల్లికార్జునరావు చేతుల మీదగా నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ ఈఏ ఆశీర్వాదం, శ్రీనివాస్, లావణ్య, పద్మజా కుమారి, విజయానంద్, లావరాజు, పల్లరెడ్డి సుధీర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో మొక్కల పెంపకం



మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

దెందులూరు: బీఆర్డీ నర్సింగ్ విద్యార్థులు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో కార్యక్రమంలో భాగంగా నేషనల్ హైవే పక్కన మామిడి, కొబ్బరి, జామ మొక్కలు నాటినట్టు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని పెంచడం వల్ల పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారుతాయన్నారు. మొక్కల ప్రాధాన్యత, మానవులకు కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రజలకు నృత్య ప్రదర్శన రూపంలో, పాటల రూపంలో విద్యార్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏసమ్మ, ఈవో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ చౌదరి, హెల్త్ డిపార్ట్‌మెంట్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందిస్తున్న దాత యుగంధర్ పెద్దిరాజు


నిడమర్రు: చిననింద్రకొలను మూర్తిరాజు జెడ్పీ స్కూల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన దాత యుగంధర్ పెద్దిరాజు రూ.15 వేలు విలువైన స్టడీ మెటీరియల్ అందించనట్లు ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయణ తెలిపారు. జాతీయ ఉపకార వేతనాలు (ఎన్‌ఎంఎంఎస్)కు శిక్షణ పొందుతున్న 8వ తరగతి విద్యార్థులకు, నవోదయ ఉమ్మడి పరీక్షకు తర్ఫీదు పొందుతున్న 5వ తరగతి విద్యార్థులకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను గ్రామ పెద్ద పత్సమట్ల లచ్చిరాజు చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది పాల్గున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దెందులూరు: విద్యార్థులు క్రమశిక్షణతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాటలో పయనిస్తూ ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) అన్నారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో సెకండ్ సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపన్నపాలెం మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు ఉన్నారు.

కొందరికే కందిపప్పు

- రేషన్ కార్డుదారుల్లో 46 శాతం మందికే అవకాశం
- కందిపప్పు పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- ప్రజాపంపిణీలో కూటమి ప్రభుత్వం వైఫల్యం



ప్రభుత్వం సరఫరా చేస్తున్న కందిపప్పు

ఉంగుటూరు: కూటమి ప్రభుత్వం ఒక్కొక్క అంశంలో వైఫల్యం చెందుతోంది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఈ నెల నుంచి రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేస్తామంటూ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ ఈ కార్యక్రమం ఆదిలోనే ప్రజాగ్రహానికి గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కో రేషన్‌కార్డుకి ఒక కేజీ కందిపప్పు అందజేయాల్సి ఉంది. కార్డుదారుల్లో 46 శాతం మందికే పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈమేరకు రేషన్ దుకాణాలు ఎండీఎస్ పాయింట్లకు కందిపప్పు ప్యాకెట్లను సరఫరా చేశారు. ఇంకా 54 శాతం మంది ప్రజలకు కందిపప్పు ఇవ్వలేకపోతున్నారు. అందరికీ కందిపప్పు అందకుంటే నిత్యావసర సరకుల పంపిణీదార్లు (వ్యాన్ల) వద్ద ప్రజల నుంచి తిరుగుబాటు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. అంతేగాక పంపిణీదారుపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. దీంతో ఈ ఇబ్బందిని ఎలా అధిగమించాలో తెలియక అధికారులు, రేషన్ డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. మార్కెట్‌లో కిలో కందిపప్పును రూ.170 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. రేషన్ దుకాణాల ద్వారా కిలో రూ.67 ధరకు అందజేయనున్నారు. దీంతో ప్రజలు రేషన్ కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. ఉదాహరణకు ఉంగుటూరు మండలంలో 26,116 రేషన్‌కార్డులున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం సరఫరా చేసిన కందిపప్పు రూ.12,013 మందికి మాత్రమే సరిపోతుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో ఉన్న పాతూరు గోడౌను నుంచి అయిదు మండలాల పాయింట్ల వద్దకు కంది పప్పు సరఫరా అయ్యింది. ద్వారకాతిరుమల, దెందులూరు, భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు మండలాలకు ఈ పాయింటు నుంచి కందిపప్పు ప్యాకెట్లు వెళ్లాయి. ఈ మండలాల పరిధిలో సుమారు 1,08860 రేషన్ కార్డులు ఉన్నాయి. అందులో 46శాతం మందికి మాత్రమే కందిపప్పు పంపిణీ చేయనున్నారు.

భయపెడుతున్న నిత్యావసరాల ధరలు



దసరా పండగ సందర్భంగా ప్రభుత్వం అందరికీ కందిపప్పు పంపిణీ చేయాలి. 46 శాతం మందికే కందిపప్పు సరఫరా చేస్తే ప్రభుత్వం ప్రజల నిరసనను ఎదుర్కోవలసి వస్తుంది. కందిపప్పు ధర మార్కెట్‌లో మండిపోతోంది. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగి భయాందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. రేషన్ సరుకుల పంపిణీలో వ్యత్యాసం చూపడం తగదు.

– చిలకంటి కుమారి, చేబ్రోలు

వివక్ష సరికాదు



కందిపప్పు సగమందికి కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ వివక్ష చూపడం సరికాదు. కందిపప్పు రేషన్‌లో అందరికీ ఇవ్వాల్సిందే. రేషన్‌లో కందిపప్పు 67 రూపాయలకు ఇస్తారంటే అందరూ సంతోషించారు. అరకొరగా కొందరికే కందిపప్పు ఇచ్చి మిగిలిన వారికి మొండి చేయి చూపడం సరికాదు. కార్డుదారులందరికీ కందిపప్పు అందించాలి.

– రాయి రాజవేణి, ఉంగుటూరు మండలం,

ఘనంగా గాంధీ జయంత్యుత్సవం



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదవేగి : దేశ జాతి పిత గాంధీజీ జయంత్యుత్సవంలో కరుణోదయ విభిన్న ప్రతిభావంతుల పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. పెదవేగి మండలం మంగళవారం వంగూరులో జేఅండ్‌జే కరుణోదయ విభిన్న ప్రతిభావంతులు విద్యాలయంలో రేపటి నుంచి పాఠశాలలకు సెలవుల సందర్భంగా మహాత్మగాంధీ జయంతిని ఏలూరు యూనిట్ మానవతా సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది పుచ్చల వెంకట్ తదితరులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉద్యోగి వళ్ళకవి శ్రీనివాసరావు విద్యార్థులు, సిబ్బందికి చాక్లెట్లు, బిస్కెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. మానవత సభ్యులు పోడూరి కనకదుర్గ, అల్లూరి మోహిని, విష్ణు, పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ హెన్రీ డోమ్నిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్టాండు లేక ప్రయాణికులకు ఇక్కట్లు



ఉంగుటూరు వద్ద ఏలూరు వైపు గతంలో పంచాయతీ నిర్మించిన బస్టాండు రేకులు ఊడిపోయిన దృశ్యం

ఉంగుటూరు: నియోజకవర్గ, మండల కేంద్రమైన ఉంగుటూరు సెంటర్లో బస్టాండ్లు లేక ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గతంలో పంచాయతీ పాలకవర్గం ఇక్కడ రోడ్డుకిరువైపులా రెండు బస్టాండ్లను నిర్మించింది. అందులో తాడేపల్లిగూడెం వైపు బస్టాండు జాతీయరహదిరి విస్తరణలో తొలగించారు. దాని స్థానే హైవే అధికారులు కాస్త దూరంలో ఓ బస్టాండు నిర్మించారు. అక్కడ బస్సులు ఆగడం లేదు. దీంతో ప్రధాన కూడలిలో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డు చెంతనే ఉన్న వివిధ రకాల హోటళ్లు, అంగళ్ల వద్ద నిలబడి వేచి చూడాల్సి వస్తోంది. ఏలూరు వైపు ఉన్న బస్టాండు పైకప్పు రేకులు ఊడి పోయాయి. అందులో బిచ్చగాళ్ల తిష్ట వేయడంతోపాటు పక్కనే ఆక్రమణల కారణంగా ప్రయాణికులు ఉండే పరిస్థితి లేదు. ఉంగుటూరులో సరైన బస్టాండు లేదని మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. ఉంగుటూరులో కొత్త బస్టాండ్లు నిర్మించి ప్రయాణికులకు వసతి చూపాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది.

పంట నమోదు త్వరితగతిన పూర్తిచేయాలి



వట్లూరులో రైతులకు సూచనలు అందిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి షేక్ అబీబ్ బాషా

పెదపాడు: పంటల నమోదుకు రైతులు తప్పనిసరిగా ఈకేవైజీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ అబీబ్ బాషా తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు, కొక్కిరపాడులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఈనెల 3వ తేదీతో పంటల నమోదు ప్రక్రియ గడువు ముగిస్తున్నందున నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ ద్వారా కలిగే లాభాలను రైతులకు తెలియజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంట కోతల సమయానికి అనుగుణంగా ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు వై సుబ్బారావు, పెదపాడు మండల వ్యవసాయ అధికారి వీ ప్రదీప్‌కుమార్, వెటర్నరీ డాక్టరు కిరణ్ పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి

భీమడోలు: రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించి ఆర్థిక స్వావలంబన సాధించాలని మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి అన్నారు. భీమడోలు సచివాలయం- 3, పోలసానిపల్లిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పొలం బాట పట్టిన అధికారులు రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సోకుతున్న తెగుళ్ల నివారణకు తగు సూచనలందించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షత వహించారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొని రైతులు సమస్యలను తెలుసుకున్నారు. సర్పంచ్ షేక్ రహీమాబేగం మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు రైతులకు సాగులో మెలకువలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలియజేసేందుకు సదస్సులు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యానవన అధికారి దేవానంద్, పశుసంవర్ధక శాఖ సర్జన్ రమ్యశ్రీ, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పిప్పర విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందీప్, జస్వంత్

గణపవరం: పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జయవెంకటేశ్వర్లు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన అల్లాడి సందీప్, దాసరి జస్వంత్ గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పీడీ ఏవీవీఆర్ ప్రసాద్‌ను రాష్ట్ర మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు, సర్పంచ్ కాకరబేబీ, విద్యా కమిటీ చైర్మన్ ద్వారంపూడి బాలాజీ తదితరులు అభినందించారు.

పాఠశాలకు గడ్డి కోత యంత్రం వితరణ



గడ్డి యంత్రాన్ని హైస్కూలుకు అందజేస్తున్న దాత కోనా శ్రీనివాసరావు

ఉంగుటూరు: కై కరం హైస్కూలుకు గడ్డి కోత యంత్రాన్ని గ్రామానికి చెందిన దాత కోన శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. హైస్కూలు గ్రౌండులో పచ్చగడ్డి, తుప్పలు పెరిగి పాములు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆట స్థలం తగ్గిపోతోంది. విషయం తెలుసుకున్న దాత కోనా శ్రీనివాసరావు రూ.15 వేల విలువ గల గడ్డికోసే యంత్రాన్ని పాఠశాలకు అందజేశారు. హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు, ఉపాధ్యాయులు దాత శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గత్తికొండ రామప్రసాదు, సిరిపి రెడ్డి బలరాం, పెనుమాక వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్ సిబ్బంది పనితీరుపై జేడీ అసహనం

దెందులూరు: కొవ్వలిలోగల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయప్రకాష్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులను సొంత పిల్లలు వలే చూసుకోవాలని, వారికి కావలసిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. హాస్టల్ నిర్వహణ పట్ల సిబ్బంది ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో హాస్టల్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ కోసం శానిటేషన్ కార్మికులతో పనులు ప్రారంభించారు. ఏలూరు ఏఎస్‌డబ్ల్యూ రమేష్ పాల్గొన్నారు.

నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై నేడు నిరాహార దీక్ష

దెందులూరు: భవన నిర్మాణ కార్మికులకు లేబర్ ఆఫీస్ ద్వారా పథకాలను అమలు చేయడం లేదని, ప్రభుత్వపరంగా సమస్యలు పరిష్కారం కావడం లేదని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏలూరు టౌన్ అధ్యక్షుడు కాకర్ల శ్రీను అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రత్యక్షంగా పరోక్షంగా నిర్మాణ రంగం పరిధిలో ఉన్న 4 లక్షల మంది ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్మాణ కార్మికులు, అనుబంధ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఏలూరు వసంతమహల్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ఎదుట నిరాహార దీక్ష చేపడుతున్నానని కాకర్ల శ్రీను అన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు: మండలంలో 11,552 పెన్షన్లకు 11,220 పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాజ్ మనోజ్ మంగళవారం తెలిపారు. 98 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు చెప్పారు. మిగిలిన వారికి కూడా బుధవారం పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో వివరించారు.

కళాశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న దాతలు

గణపవరం: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు దాతలు తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని పలువురు అన్నారు. మంగళవారం గణపవరానికి చెందిన పేరిచర్ల శింగరాజు, వెంకటసుబ్బాయమ్మ మెమోరియల్ ట్రస్ట్ నాలుగవ వార్షికోత్సవం సందర్భంగా కూసంపూడి మూర్తిరాజు సహకారంతో ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సుమారు రూ.50వేల విలువైన యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్ర కుమార్‌రాజు, ప్రిన్సిపల్ శ్రీనివాసగౌడ్, జూపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



కాగుపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ఉంగుటూరు: కేంద్ర ప్రభుత్వం నియమించిన అధికారుల బృందం సభ్యులు ఉంగుటూరు మండలంలో మంగళవారం పర్యటించారు. ఎస్‌ఎల్‌ఎం టీము సభ్యులు కాగుపాడు, వీఏపురంలో పర్యటించారు. కాగుపాడు సచివాలయ ఉద్యోగులతో సమావేశమై వాళ్ల పనితీరు తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలతో, పెన్షన్ల పంపిణీని పరిశీలించారు. వ్యవసాయం, జలజీవన్ మిషన్ పనులను వారు పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు స్థానిక నాయకులు, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ పథకం,లబ్ధిదారులతో సమీక్షించారు. తహసీల్దారు బొద్దేపల్లి ప్రసాదు, ఎంపీడీవో రామ్ మనోజ్ వారి వెంట ఉన్నారు.

గాంధీజీ శాంతి మార్గం భారతావనికి ఆదర్శం



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫాదర్ పి.బాల

దెందులూరు: జాతిపిత మహాత్మా గాంధీ శాంతి మార్గం భారతావనికి ముఖ్యంగా యువతకు ఆదర్శనీయమని ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. మంగళవారం సోమవరప్పాడులోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి డాక్టర్ బాల పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలో పోరాటంలో ఆయన పాత్ర కీలకమన్నారు.

దత్తత పిల్లలను కంటికి రెప్పలా కాపాడాలి



దత్తత తల్లితండ్రులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): దత్తత తీసుకున్న పిల్లలను కంటికి రెప్పలా చూడటంతోపాటు వారిని విద్యావంతులుగా చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం విల్సన్ పాల్ సాయికిరణ్ (13) అనే బాబుని కేరింగ్స్ పోర్టల్ ద్వారా అదిలాబాద్ జిల్లాకు చెందిన తల్లిదండ్రులకు కలెక్టర్ సమక్షంలో దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పెద్ద పిల్లలను దత్తత తీసుకోవటానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను అభినందించారు.

ప్రమాదాలకు నిలయంగా మలుపులు



వంగూరు వద్ద ప్రమాదకరంగా మలుపు

- అదుపుతప్పితే అంతే సంగతులు
- కనీసం హెచ్చరిక బోర్డుకూడా లేదు
- రక్షణ కల్పించాలంటున్న ప్రయాణికులు



కొండలరావుపాలెం వద్ద మలుపు



లక్ష్మీపురంలోని ప్రమాదకర మలుపు

పెదవేగి : మండలంలోని పలు గ్రామాలకు చెందిన మలుపులు ప్రమాదానికి నెలవుగా మారి ప్రయాణికులను ఇబ్బందికరంగా మారాయి. దీంతో నిత్యం ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిల్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. పెదవేగి మండల పరిధిలోని జానంపేట, లక్ష్మీపురం, కొండలరావులపాలెం, గార్లమడుగు, తదితర గ్రామాల్లోని మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ రహదారుల్లోని మలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయాపడుతున్నారు. మరి కొంత మంది ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. కనీసం ఈ ప్రమాదకర మలుపులలో హెచ్చరిక బోర్డును సైతం ఏర్పరచడం లేదని, ఈ రహదారులలో ప్రయాణం చేయాలంటే తమకు ముచ్చెమటలు పడుతున్నాయని ఆయా మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు 3న దీక్ష

ఏలూరు (టూటౌన్): విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఈనెల 3న ఏలూరులో నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం మంగళవారం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు లేదన్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులు, మంత్రులు వ్యవహరిస్తున్న తీరు, రాజకీయ నాయకులు ప్రకటనలు చూస్తుంటే విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో పెద్ద కుట్ర జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం చెప్పేదానికి, చేస్తున్న పనులకు పొంతనలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే ఒక్క పైసా కూడా ఖర్చుకాదని తెలిపారు. రూ.లక్ష కోట్లతో సెయిల్ విస్తరణ ప్రణాళిక రూపొందించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 20 మిలియన్ టన్నులకు విస్తరించేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తక్షణం సెయిల్‌లో విలీనం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, పి.పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

పెదపాడు : అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తేనే కుటుంబం, గ్రామం, ఆరోగ్యంగా ఉంటుందని దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ దెందులూరు మండలం పంచాయతీల విస్తరణాధికారి మూర్తి అన్నారు. మంగళవారం దెందులూరు ఎంపీడీఓ వి. శ్రీలత ఆధ్వర్యంలో దెందులూరులో అంగన్‌వాడీ, వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పరిశుభ్రతకు సమయం కేటాయించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి వ్యక్తీ రోజులో రెండు గంటల సమయం పరిశుభ్రతకు వినియోగిస్తే ఎన్నో ప్రయోజనాలు పొందుతామని డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు అన్నారు. స్థానిక సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ-2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదన్నారు. ప్రతి వ్యక్తీ తన చుట్టూపక్కల ఉన్న పరిసరాల శుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ డి.కిషోర్, సెంట్రల్ రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం నానాజీ, సెట్‌వెల్ సీఈఓ కె.ప్రభాకర్, కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.శబరికుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.